# కాంట్రాక్టు ఏఎన్‌ఎంల నిరసన బాట

- రెగ్యులరైజ్ కోసం కరీంనగర్ డీఎంహెచ్‌వో ఆఫీస్ ఎదుట ధర్నా
- రాత పరీక్ష వాయిదా వేయకపోతే నిరవధిక దీక్ష చేస్తామని హెచ్చరిక



*కరీంనగర్ జిల్లా వైద్యాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు*

కరీంనగర్ విద్యానగర్, డిసెంబర్ 20: డిమాండ్ల సాధన కోసం కాంట్రాక్టు ఏఎన్‌ఎంలు నిరసన బాట పట్టారు. రాత పరీక్ష లేకుండా తమను రెగ్యులరైజ్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కరీంనగర్‌లోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా యూపీహెచ్‌సీ యూనియన్ నాయకురాలు సంపూర్ణ మాట్లాడుతూ, 24 ఏళ్ల నుంచి ఏఎన్‌ఎంగా పని చేస్తున్నా రెగ్యులర్ కాకపోవడం అత్యంత బాధాకరమని వాపోయారు. గతంలో సమస్యల పరిష్కారానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సెప్టెంబర్ 2న ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ఈ కమిటీ ఏఎన్‌ఎంలతో చర్చించి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి ఇవ్వాలని ఉన్నా.. ఆ కమిటీ రిపోర్టు లేకుండా రాత పరీక్ష తేదీ ప్రకటించడం దారుణమన్నారు. రాత పరీక్షను వాయిదా వేయాలని రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు పద్ధతిలో పని చేస్తున్న 6500 మంది ఏఎన్‌ఎంలు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. తెలంగాణ వైద్య ఆరోగ్య సంఘాల పోరాట కమిటీ పిలుపు మేరకు 33 జిల్లాల్లో 48 గంటల నిరసన కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు. ప్రభుత్వం రాత పరీక్షను వాయిదా వేయకపోతే నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సంతోష, స్వరూపారాణి, రజిత, స్రవంతి, రమాదేవి, తదితరులు పాల్గొన్నారు.


# పాముల సంచారానికి ప్రధాన ద్వారాలివిగో!

- పెద్దాపూర్ గురుకులం ప్రహరీ పిల్లర్ల మధ్య గ్యాప్‌లు
- ఆవరణలో పాడుబడిన బావి





*పెద్దాపూర్ గురుకుల ఆవరణలో పాడుబడిన బావిలో తేలియాడుతున్న పాము*



*పెద్దాపూర్ గురుకుల పాఠశాల ప్రహరీ పిల్లర్ల మధ్య ఉన్న గ్యాప్*

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 20: మెట్‌పల్లి మం డలం పెద్దాపూర్ బాలుర గురుకులంలో పాముల భయం వెంటాడుతూనే ఉన్నది. ఇద్దరు విద్యార్థు మృతి, మరో ఆరుగురు విద్యార్థుల అస్వస్థతకు పాముకాట్లేనని తెలుస్తుండడం ఆందోళన కలిగిస్తున్నది. అయితే సుమారు 11ఎకరాల్లో విస్తరించి ఉన్న పెద్దాపూర్ గురుకులం చుట్టూ ప్రహరీ ఉన్నప్పటికీ.. పిల్లర్ల మధ్య సుమారు ఏడు గ్యాప్‌లున్నాయి. పంటపొలాల నుంచి పాములు, విష కీటకాలు గురుకులం లోపలికి వచ్చేందుకు ఈ ప్రహరీ గ్యాప్‌లే ద్వారాలుగా మారాయి. అలాగే ప్రహరీ సమీపంలో ఉన్న పాడుబడిన బావి పాములకు నిలయంగా మారింది. గురువారం ఈ బావిలో ఓ పాము తేలియాడుతూ కనిపించింది. కేవలం ఆవరణలో పిచ్చిమొక్కల తొలగింపుపైనే దృష్టిపెట్టిన అధికారులు ప్రహరీ గ్యాప్‌లను మూసివేయడంతోపాటు పాడుబడిన బావిని పూడ్చివేయాల్సిన అవసరం ఉన్నది.

# 'ఆరోగ్యశ్రీ' బకాయిలు రూ.100 కోట్లకుపైనే!

- ఉమ్మడి జిల్లాలో కంటితుడుపుగా చెల్లింపులు!
- నామమాత్రంగా విడుదల చేస్తున్న సర్కారు
- సేవలకు నిరాకరిస్తున్న పలు ఒప్పంద దవాఖానలు
- అత్యవసర పరిస్థితుల్లో పేదలకు వైద్యం గగనమే
- పెరుగుతున్న ఫిర్యాదులు
- రూ. లక్షల్లో పెనాల్టీ విధింపు

**పేద రోగుల పాలిట కల్పతరువుగా భావించే ఆరోగ్యశ్రీ పథకం, కాంగ్రెస్ పాలనలో గాడితప్పుతున్నది. ఏడాది కాలంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఒప్పంద దవాఖానలు సుమారు ₹156 కోట్ల విలువైన సేవలు అందించినా.. బిల్లుల చెల్లింపుల్లో తీవ్ర జాప్యం జరుగుతున్నది. ఇంకా ₹100 కోట్లకుపైనే బకాయిలు ఉన్నట్లు తెలుస్తుండగా, పలు దవాఖానలు సేవలకు నిరాకరిస్తున్నాయి. ఆరోగ్యశ్రీ అంటేనే హడలి పోతూ తామీ సేవలు అందించలేమని చేతులెత్తేస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో పేదల ప్రాణాల మీదకు వస్తుండగా, సర్కారు తీరుపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.**

కరీంనగర్, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ)/విద్యానగర్ : పేదలకు ఆరోగ్య సేవలందించేందుకు ప్రవేశ పెట్టిన రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకం కింద గతంలో ₹5 లక్షల వరకు ప్యాకేజీ ఉండేది. అధికారంలోకి వచ్చిన వెంటనే అంటే గతేడాది డిసెంబర్9న కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్యాకేజీని కాస్త ₹10 లక్షలకు పెంచింది. అంతేకాకుండా కేంద్రం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంతో అనుసంధానం చేసుకున్నది. ఈ రెండు పథకాలను రాష్ట్ర స్థాయిలో రాజీవ్ ఆరోగ్య హెల్త్ కేర్ ట్రస్ట్ పర్యవేక్షిస్తున్నది. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద క్యాన్సర్, గుండె జబ్బులు, కిడ్నీ, నరాల వ్యాధులు, ఆర్థోపెడిక్, జీర్ణాశయ, శ్వాసకోష సమస్యలు, బర్నింగ్, నియోనాటల్ కేర్ (ఎస్‌ఎన్‌సీయూ) తదితర 1,672 రకాల వ్యాధులతో కూడిన జాబితా ఉండేది. గతేడాది డిసెంబర్‌లో వీటికితోడు మరో 163 రకాలను యాడ్ చేశారు. దీంతో ఇప్పుడు 1,835 రకాల వ్యాధులకు ఆరోగ్యశ్రీలో చికిత్సలు, శస్త్ర చికిత్సల సేవలు అందిస్తున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నది. కానీ, ప్యాకేజీ పెంచడంలో ఉత్సాహం చూపిన రాష్ట్ర ప్రభుత్వం బిల్లులు చెల్లించడంలో చూపడం లేదనే ఆరోపణలు వస్తున్నాయి.

## ₹వంద కోట్లకుపైగా బకాయిలు

ఉమ్మడి జిల్లాలోని కరీంనగర్‌లో 4 ప్రభుత్వ, 22 ప్రైవేట్, జగిత్యాలలో 4 ప్రభుత్వ, 7 ప్రైవేట్, పెద్దపల్లిలో 4 ప్రభుత్వ, ఒక ప్రైవేట్, సిరిసిల్లలో 4 ప్రభుత్వ, 2 ప్రైవేట్ దవాఖానలు ఆరోగ్య శ్రీలో చేర్చారు. ఏడాది కాలంలో 67,700కుపైగా రోగులకు ₹156 కోట్ల విలువైన వైద్య సేవలు అందించారు. కరీంనగర్ జిల్లాలో చెందిన 19,644 మందికి ₹45.38 కోట్లు, జగిత్యాలలో 18,763 మందికి ₹42.86 కోట్లు, పెద్దపల్లిలో 15,772 మందికి ₹35.52 కోట్లు, సిరిసిల్ల జిల్లాలో 13,533 మందికి ₹32.24 కోట్ల విలువైన సేవలందించారు. కానీ ఇప్పటి వరకు అందులో 20 శాతం బిల్లులు కూడా చెల్లించని దయనీయస్థితి ఉన్నది. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఒక కార్పొరేట్ దవాఖానకు ₹5 కోట్ల బిల్లులు, అలాగే మరో కార్పొరేట్ దవాఖానకు ₹6 కోట్లకుపైగానే రావాల్సి ఉంది. ఈ రెండు దవాఖానలకు సంబంధించి 2023 సెప్టెంబర్‌లో ఒకదానికి ₹25 లక్షలు, మరొకదానికి ₹30 లక్షల బిల్లులు మాత్రమే చెల్లించారు. ఆ తర్వాత నయా పైసా బిల్లు రాలేదని నిర్వాహకులు వాపోతున్నారు. చిన్నాచితక దవాఖానాల పరిస్థితి మరీ దయనీయంగా మారింది. ₹50 లక్షల నుంచి ₹రెండు కోట్ల వరకు బకాయిలు ఉన్నా, ఏడాది కాలంగా బిల్లులు క్లియర్ చేయకపోవడంతో నిర్వాహకులు ఇబ్బందులు పడాల్సి వస్తున్నది.



*..పైచిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు పత్తెం రాజయ్య. ఊరు పెగడపల్లి మండలం రాములపల్లి. ఈ నెల 15న ఆయనకు గుండెలో నొప్పి రావడంతో అతడి కొడుకు నరేశ్ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆరోగ్య శ్రీ ఒప్పంద దవాఖానలో చేర్పించాడు. ముందుగా అంజియోగ్రామ్ చేసిన వైద్యులు, అతనికి అర్జెంట్‌గా బైపాస్ సర్జరీ చేయాలని లేదంటే ప్రాణాలకే ప్రమాదమని, సర్జరీకి ₹3.50 లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. దీంతో ఆందోళన చెందిన నరేశ్, కుటుంబ సభ్యులు ఆరోగ్యశ్రీలోనే సర్జరీ చేయాలని కోరారు. ఇది ఆరోగ్య శ్రీ పరిధిలోకి రాదని, వెంటనే డబ్బులు చెల్లించాలని ఒత్తిడి తెచ్చారు. తమ వద్ద అంత డబ్బు లేదని చెప్పడంతో సదరు దవాఖాన నిర్వాహకులు తమ వద్ద సర్జరీ మిషన్ లేదని మరుసటి రోజు రాజయ్యను డిశ్చార్జ్ చేశారు. దీనిపై రాజయ్య కొడుకు ఆరోగ్య శ్రీ అధికారులకు ఫిర్యాదు చేయడంతో కరీంనగర్‌లోని మరో ఒప్పంద దవాఖానలో చేర్పించి వెంటనే బైపాస్ సర్జరీ చేయించారు. రాజయ్యకు సేవలు నిరాకరించిన దవాఖానాకు నోటీస్ జారీ చేశారు. అయితే ఇందుకు కారణం ఆరోగ్యశ్రీలో సకాలంలో బిల్లు లు చెల్లించకపోవడమేనని స్పష్టంగా తెలుస్తున్నది. ఈ ఒక్క సంఘటన వెలుగులోకి వచ్చినా.. నిత్యం ఇలాంటివి ఎన్నో జరుగుతున్నా బయటికి రావడం లేదు.*

## కాలయాపనతో తప్పని భారం

ఆరోగ్యశ్రీ బిల్లులు నిజానికి ప్రతి రెండు నెలలకోసారి చెల్లించాల్సి ఉంటుంది. కానీ, నెలలు, ఏడాది కూడా గడుస్తుండడంతో చిన్న చిన్న ఎంప్యానల్డ్ దవాఖానలపై భారం పడుతున్నది. అది ఏ వ్యాధికి సంబంధించిన ప్యాకేజీ అయినా ప్రతి దానిలో వచ్చే ఇన్సెంటివ్ 10 శాతానికి మించదు. అనేక శస్త్ర చికిత్సలకు అవసరమైన మిషన్ల వినియోగం, వైద్య పరికరాలు సమకూర్చడం వంటివి ఎంప్యానల్డ్ దవాఖానలు ముందు ఖర్చు పెట్టి సేవలందించాల్సి ఉంటుంది. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులకు ముందుగానే విలువైన స్టంట్లు, ఇతర మిషన్లు వాడతారు. ఒక్కో మిషన్‌కు కనీస ధర ₹50 వేలు ఉంటుంది. ఇంకా ఎక్కువ విలువైనవి కూడా ఉంటాయి. కానీ ఆరోగ్యశ్రీ ట్రస్ట్‌లో నెలలు, ఏళ్ల తరబడి బిల్లులు ఆగిపోవడంతో వచ్చే కొద్ది ఇన్సెంటివ్ కూడా హరించుకుపోతుందని నిర్వాహకులు వాపోతున్నారు. సిబ్బంది వేతనాలు, దవాఖానల నిర్వహణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా ఈ ప్రభావం పరోక్షంగా రోగులపైనా పడుతున్నది. సకాలంలో బిల్లులు రావడం లేదని మెరుగైన వైద్యం చేసేందుకు వైద్యులు ముందుకు రావడం లేదనే విమర్శలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## సేవలకు నిరాకరిస్తున్న దవాఖానలు

ఆరోగ్యశ్రీ బిల్లులు రాకపోవడంతో కొన్ని ఎంప్యానల్డ్ దవాఖానలు ఈ పథకం కింద సేవలను అందించేందుకు నిరాకరిస్తున్నాయి. కొన్ని హాస్పిటళ్లు ముందుగా చేర్పించుకొని, పరీక్షలు చేసిన తర్వాత ఆరోగ్య శ్రీ పరిధికి వచ్చే వ్యాధుల చికిత్స చేయకుండా డబ్బులు వసూలు చేస్తున్నాయి. ఆరోగ్య మిత్రలు లేని అనేక ఎంప్యానల్ దవాఖానల్లో ఇదే పరిస్థితి కనిపిస్తున్నది. ఆరోగ్య శ్రీ కార్డును నమ్ముకొని వస్తున్న రోగులపై పెను భారం పడుతున్నది. ముఖ్యంగా గుండె సంబంధిత వ్యాధులతో చేరుతున్న పేషెంట్లకు ప్రాణాల మీదికి వస్తున్నది. బిల్లులు సకాలంలో రావడం లేదనే కారణంతో కొన్ని దవాఖానలు రోగులకు ఇది ఆరోగ్య శ్రీ పరిధికి రాదని తప్పుడు సమాచారం ఇస్తున్నాయి. ఇలాంటి వాటిపైనా ఫిర్యాదులు పెరుగుతున్నాయి. ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా పెనాల్టీలు కూడా విధిస్తున్నారు. ఇటీవలి కాలంలో ఓ కార్పొరేట్ దవాఖానకు ₹8 లక్షల పెనాల్టీ విధించినట్టు తెలుస్తున్నది. ఆరోగ్యశ్రీ ప్యాకేజీలో ఉన్నా డబ్బులు చెల్లిస్తేనే చికిత్సలు, శస్త్ర చికిత్సలు చేస్తామని, లేదంటే డిచార్జ్ చేస్తామని కూడా కొన్ని హాస్పిటళ్ల నిర్వాహకులు చెబుతున్నారు. ఇటీవల ఓ దవాఖానలో ఆరోగ్య శ్రీ కార్డుపై చేరిన రోగికి ఇదే విధమైన అనుభవం ఎదురుకాగా, ఆరోగ్యశ్రీ అధికారులకు ఫిర్యాదు రాగా, అధికారులు స్పందించి అతన్ని మరో దవాఖానలో చేర్పించి చికిత్స అందించారు.

## ప్రభుత్వ దవాఖానలకు కోట్లలోనే..

ఆరోగ్య శ్రీ సేవలందించే ప్రభుత్వ దవాఖానల పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. ఒక్క కరీంనగర్‌లోని ప్రభుత్వ దవాఖానకే ₹2 కోట్లకుపైగా బిల్లులు రావాల్సి ఉందని తెలుస్తున్నది. ఈ జిల్లాలోని ఇతర ప్రభుత్వ ఎంప్యానల్డ్ దవాఖానలతోపాటు జగిత్యాల, పెద్దపల్లి, సిరిసిల్ల దవాఖానలకు మరో ₹2 కోట్ల పైనే ఆరోగ్య శ్రీ బకాయిలు ఉన్నట్లు సమాచారం. ఆ బిల్లులు చెల్లిస్తే అందులో 45 శాతం నిధులను దవాఖానల్లో సదుపాయాలు మెరుగు పర్చుకునేందుకు వినియోగించుకునే అవకాశముంటుంది. దవాఖానల్లో ఉన్న మిషన్లు బాగు చేయించుకోవడంగానీ, కొత్తవి కొనుగోలు చేసుకునేందుకుగానీ, పారిశుధ్యం మెరుగు పర్చుకునేందుకు గానీ.. ఇలా అనేక విధాలుగా ఈ నిధులను వినియోగించుకునేందుకు ఆస్కారముంటుంది. కానీ, నెలల తరబడి బకాయిలు పెట్టడంతో వైద్యుల్లో కూడా నైరాశ్యం అలుముకుంటున్నది.



*మంచిర్యాల జిల్లా మందమర్రిలో పోలీసులు అదుపులో ఉన్న ఆటో డ్రైవర్లు*

# ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తం

- రాష్ట్రవ్యాప్తంగా ఆటోడ్రైవర్ల ముందస్తు అరెస్టులు
- హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో అడ్డగింతలు
- కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధిచెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ఆటోడ్రైవర్ల హెచ్చరికలు

హైదరాబాద్ సిటీబ్యూరో, డిసెంబర్ 20 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఉపాధి కోల్పోయామని, హామీ మేరకు ఆర్థిక సాయం చేయాలనే డిమాండ్‌తో ఆటోడ్రైవర్ల అసెంబ్లీ ముట్టడి ఉద్రిక్తంగా మారింది. జేఏసీ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి ఆటోడ్రైవర్లు హైదరాబాద్‌కు తరలివచ్చారు. హిమాయత్‌నగర్ ఏఐటీయూసీ కార్యాలయం నుంచి అసెంబ్లీ వరకు ర్యాలీగా బయల్దేరేందుకు సిద్ధమైన ఆటోడ్రైవర్లను కాస్త ముందుకు వచ్చిన తర్వాత పెట్రోల్‌బంక్ కూడలిలోనే అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్లు, పోలీసులకు మధ్య తోపులాట జరిగింది. అనంతరం ఆటోడ్రైవర్లను నిర్బంధించి నగరంలోని వివిధ పోలీసు స్టేషన్లకు తరలించారు. ఆటో జేఏసీ నాయకులను ముందుస్తుగానే అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకులు మారయ్య, వెంకటేశ్, సత్తిరెడ్డి మాట్లాడుతూ.. ఉచిత బస్సు స్కీమ్ తీసుకొచ్చి ఆటోడ్రైవర్లకు ఉపాధి లేకుండా చేశారని, ఆటోడ్రైవర్లను ఆదుకుంటామన్న ప్రభుత్వం దారుణంగా మోసగించిందని ఆగ్రహం వ్యక్తంచేశారు. చర్చలకు పిలుస్తామని మాటిచ్చిన రాష్ట్ర రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కనీసం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తమ ఉద్యమం ఆగదని.. ప్రభుత్వం హామీలన్ని నెరవేర్చే వరకు పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు.

## ఆటోడ్రైవర్లకు ఇంత విషం ఇవ్వండి

**ఆటో డ్రైవర్ల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్**

కోల్‌సిటీ, డిసెంబర్ 20 : కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసినందుకు తమ చేతులతో తమ చెంపలను కొట్టుకుంటున్నామని ఆటోడ్రైవర్ల యూనియన్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మంద రవికుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ఆయన గోదావరిఖనిలో విలేకరులతో మాట్లాడారు. ఆటో డ్రైవర్ల ఉసురు పోసుకోవడం కంటే ఈ ప్రభుత్వ పెద్దలే తమకు ఇంత విషం ఇవ్వాలని చెప్పారు. వెంటనే ఆటో కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఆటో డ్రైవర్‌కు నెలకు రూ.12 వేలు ఇవ్వాలని కోరారు.

## ఆటో కార్మికుల అరెస్ట్

నమస్తే నెట్‌వర్క్ డిసెంబర్ 20: సమస్యల పరిష్కారం కోసం చలో అస్లెంబీకి బయలుదేరి ఆటో యజమానులు, డ్రైవర్లను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా హైదరాబాద్‌కు వెళ్తున్న ఆటో కార్మికులను ముందస్తుగా అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలించారు.



## కేటీఆర్‌ను కలిసిన ఆటోవాలాలు

*అలంపూర్ చౌరస్తా, డిసెంబర్ 20 : హైదరాబాద్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను ఆటోవాలాలు మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి తమ పక్షాన కాంగ్రెస్ ప్రభుత్వంతో కొట్లాడుతున్నందుకు ఆటో డ్రైవర్లు కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే 100 మందికిపైగా ఆటో డ్రైవర్లు ఆత్మహత్యలు చేసుకున్నారని, ఇకపై ఎవరూ అలాంటి పనులు చేయొద్దని భరోసానిచ్చారు. మీ సమస్యలపై పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని కేటీఆర్ హామీ ఇచ్చారు.*





